# రైతుల కష్టాలు తీర్చింది కేసీఆరే



అంతర్గాం : ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- పని చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- రామగుండంబీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

అంతర్గాం, నవంబర్ 21: కాంగ్రెస్ పాలనలో మన బతుకులు ఆగం అయ్యాయి...తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ అయ్యాక రైతుల జీవితాలు బాగు పడ్డాయని రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. అంతర్గాం మండలం విస్సంపేట, ఎగ్లాస్‌పూర్‌లో మంగళవారం కోరుకంటి చందర్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణను, ప్రజల జీవితాలను నాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. పచ్చగున్న తెలంగాణలో చిచ్చుపెట్టేందుకు కుట్రలు మొదలయ్యాయని పేర్కొన్నారు. నాడు కరెంట్ కోతలో అల్లాడిపోయిన రైతులు నేడు సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంట్‌తో పంటలు పండిస్తున్నరన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే 3 గంటల కరెంట్‌తోనే గడపాల్సి వస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తున్న సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాలని, ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆముల నారాయణ, సర్పంచ్ గంగధరి దేవమ్మ రాములు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు దివాకర్, నాయకులు కౌశిక హరి, గోపు అయిలయ్య యాదవ్, తిరుపతి నాయక్ బోడకుంట సంతోష్, ముదాం తిరుపతి, బరుపతి చిలకయ్య పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం**

పాలకుర్తి, నవంబర్21: పాలకుర్తి మండల కేంద్రంలో సర్పంచ్ దుర్గంజగన్ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి గడపగడపకూ బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి కోరుకంటి చందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత దశాబ్ద కాలంగా బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

**డివిజన్లలో బీఆర్ఎస్ ప్రచారం**

గోదావరిఖని, నవంబర్ 21: రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి కార్పొరేషన్ పరిధిలోని 7, 40, 49వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వం, ఎమ్మెల్యే కోరుకంటి నేతృత్వంలో రామగుండం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దుబాసి లలిత మల్లేశ్, నూతి తిరుపతి పాల్గొన్నారు.



గోదావరిఖని : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పాలకుర్తి : ఎన్నికల ప్రచారం చేస్తున్న సర్పంచ్ దుర్గం జగన్, మహిళలు

# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు



మాట్లాడుతున్న పుట్ట మధూకర్

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కారు చీకట్లే
- బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధుకర్

ముత్తారం, నవంబర్ 21: మంథని ఎమ్మెల్యేగా ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. మండలంలోని మైదంబండ, సర్వారం, ఖాజీపల్లి, లక్కారం, శుక్రవారం పేట, మచ్చుపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సీఎం సారథ్యంలో రైతాంగానికి 24 గంటల నాణ్యమైన విధ్యుత్ అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే మూడు గంటల కరెంటు ఇస్తామని చెబుతున్నారన్నారు. మూడు గంటల కరెంటు ఇచ్చే కావాలో, 24 గంటల కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. తనకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. గతంలో శుక్రవారంపేటకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, కాని ఇప్పుడు రూ. 1.35 కోట్లతో సీసీ రోడ్డు వేశామని చెప్పారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారని వాళ్లని నమ్మి ఓటేస్తే మంథనిలో కారు చీకట్లేనని అన్నారు. ఇప్పటికైనా మంథనిలో అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటువేయాలని కోరారు. మైదంబండలో అనారోగ్యంతో బాధపడుతున్న గాదం భూమయ్యను పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జడ్పీటీసీ చెల్కల స్వర్ణలత అశోక్, పిఏసిఎస్ చైర్మన్ గుజ్జుల రాజీరెడ్డి, వైస్ ఎంపీపీ సుదాడి రవీందర్ రావు, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు అత్తే చంద్రమౌళి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పప్పు స్వరూప, సర్పంచ్‌లు ఎర్రం శారద సదానందం, అత్తె లలిత, వేల్పూరి సంపత్ రావు, నెత్తెట్ల మహేందర్, గాదం స్రవంతి శ్రీనివాస్, ఎంపీటీసీలు బియ్యని శ్యామల సదానందం, ఒద్ది తిరుమల తిరుపతి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బియ్యని రాజు, గ్రామశాఖ అధ్యక్షులు జంగ వెంకట్‌రెడ్డి, మాదాసు రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాంసాని సమ్మయ్య అధిక సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు, రేపు 12డీ పోలింగ్

జ్యోతినగర్, నవంబర్ 21: ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు 12డీ విధానంలో దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఈ నెల 22, 23న పోలింగ్ చేపడుతున్నట్లు రామగుండం నియోజకవర్గ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ జ్యోతి తెలిపారు. ఎన్టీపీసీలోని ఈడీసీ మిలినీయం హాల్‌లో మంగళవారం మై హోం ఓటింగ్‌పై మైక్రోఅబ్జర్వలకు నిర్వహించిన అవగాహన శిక్షణలో ఆమె మాట్లాడారు. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, కొవిడ్ బాధితులకు ఇంటి నుంచి ఓటువేసే అవకాశం 12డీ విధానాన్ని భారత ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు. 12డీకి సంబంధించి నియోజకవర్గంలో 331 ఓటర్లు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ప్రాంతాల వారీగా విభజించి 24 రూట్లు ఏర్పాటు చేసి 24 బృందాలను కేటాయించామని వివరించారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఇం టివద్ద జరుగు ఓటింగ్ విధానం సజావుగా జరిగేలా చూసి మైక్రో అబ్జర్వర్ రిపోర్టు ఆన్ హోం ఓటింగ్ ఫామ్‌పై అట్టెస్టేడ్ సంతకం చేయాలని సూచించారు. ఇక్కడ శిక్షణ విభాగం నోడల్ ఆఫీసర్ సంపత్‌రావు, తదితరులు ఉన్నారు.

**ఈవీఎంలపై ర్యాండమైజేషన్**

రామగుండం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం మిషన్ల రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీపీసీలోని ఆర్వో కార్యాలయంలో అభ్యర్థులకు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవీఎం మిషన్‌లు, పోలింగ్ కేంద్రాల వరుస సంఖ్య, పోలింగ్ కేంద్రానికి కేటాయించిన ఈవీఎంల వివరాలు తెలిపి అభ్యర్థులకు వివరాల పత్రాన్ని అందజేశారు. ఇంటి నుంచి ఓటు వేసే 12డీ విధానంకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తెలిపారు. ఇక్కడ రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ ఉన్నారు.




అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఓటు హక్కు వజ్రాయుధం

కోల్‌సిటీ, నవంబర్ 21: పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించుకోవడంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరి వజ్రాయుధమనీ, అసంఘటిత కార్మికులు పోలింగ్ రోజున తప్పకుండా తమ ఓటును హక్కును వినియోగించుకోవాలని రామగుండం నగర పాలక కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, రామగుండం కార్మిక శాఖ అధికారి శ్రీధర్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్ ఖాన్ సూచించారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా అసంఘటిత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు, ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు ఆట పాటలతో చైతన్యపరిచారు. ఈనెల 30వ తేదీన జరగనున్న ఎన్నికల్లో అసంఘటిత కార్మికులు తప్పకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం గోదావరిఖని లెనిన్ నగర్, సీతానగర్‌లో కళాకారులు చైతన్య రథంతో ఓటు ప్రాధాన్యతపై ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి స్వరూపరాణి, మెప్మా డీఎంసీ రజనీ, జూనియర్ అసిస్టెంట్‌లు, మున్సిపల్, ఐసీడీఎస్, ఆర్‌పీలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ అధికారులకు శిక్షణ

జ్యోతినగర్, నవంబర్ 21: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో రామగుండం నియోజకవర్గనికి సంబంధించి పీవో, ఏపీవోలకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ హాల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జే అరుణశ్రీ శిక్షణ ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారుల విధులు, జాగ్రత్తలను శిక్షణ నోడల్ ఆఫీసర్ సంపత్‌రావు వివరించారు. పోలింగ్ విధుల హ్యాండ్ బుక్ అందజేసిన అధికారులు ప్రొజెక్టర్ ద్వారా ప్రత్యక్షంగా ఈవీఎంల పనితీరు సీయూబీయూ, వీవీ ప్యాడ్‌లపై పూర్తి అవగాహన శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా, రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధలను ప్రకారం పోలింగ్ నిర్వహణలో పీవోల బాధ్యత కీలకమన్నారు. పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను గమనించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే సమయం, పోలింగ్ అనంతరం ఆర్వో కార్యాలయంకు వచ్చే సమయంలో వారికి గుర్తింపు ఇచ్చిన వాహనంతో ఆయా మార్గంలోనే రావాలన్నారు. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ జ్యోతి, మాస్టర్ ట్రైనర్స్ బృందం, పీఓ, ఏపీవోలు ఉన్నారు.

**ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ**

పెద్దపల్లి కమాన్, నవంబర్ 21 : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై పెద్దపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు మంథని, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు చెందిన 360 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు శిక్షణకు హాజరయ్యారు. మాస్టర్ ట్రైనీలు ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుమోహన్ ఆధ్వర్యంలో ఓదెల తహసీల్దార్ బీ యాకన్న, పెద్దపల్లి ఎంఈవో టీ సురేందర్ కుమార్, ఆర్ఐ నవీన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ ఇంతియాజ్ శిక్షణను పర్యవేక్షించారు.